


బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.79,720 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.7,268 |
| వెండి: | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.94,100 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.97.10 |

# ఇంటి ముంగిటకే మద్యం!

- విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణ
- తాజాగా శ్రీధనమల్లిలో భహిరంగ వేలం
- రూ.1.6 లక్షలకు దక్కించుకున్న స్థానికుడు


శ్రీధనమల్లి గ్రామంలో బెల్టు దుకాణం కోసం వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

**దొరవారిసత్రం:** కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల మాటేమోగానీ.. మద్యాన్ని మాత్రం ఇంటి ముంగిటకే అందించేందుకు శతవిధాలా యత్నిస్తోంది. ఇందులో భాగంగానే గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహణ కొనసాగుతోంది. పోటీ ఉంటే వేలం పాటలు పెట్టి మరీ షాపులు నిర్వహించుకునేందుకు ప్రోత్సహిస్తోంది.

**డీవీ సత్రంలో లక్షల్లో వేలం పాటలు**

దొరవారిసత్రం మండల పరిధిలోని 65 గ్రామాల్లో 35,900 మంది జనాభా ఉన్నారు. అధికారంగా రెండు మద్యం షాపులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా దొరవారిసత్రం, పూలతోట గ్రామాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. ఇవి కాకుండా ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలు ఏర్పాటుకు ఆయా ప్రాంతాల్లోని క్షేత్ర స్థాయి పచ్చ నేతలు బహిరంగంగా వేలం పాటలు నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులకు స్థానిక పోలీసుల నుంచి ఎక్సైజ్ పోలీసుల వరకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తామే చూసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే వేణుంబాకం, కల్లూరు, ఉచ్చూరు, శ్రీధనమల్లి, తొగరాముడి, మీజూరు తదిరత గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించినట్టు తెలిసింది. ఒక్కో బెల్టు షాపును రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వేలం పాటలో దక్కించుకున్నట్టు సమాచారం.

## క్లుప్తంగా

### విద్యా సామగ్రి వితరణ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ

**పాకాల :** మండలంలోని పచ్చిపాలపల్లె ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు స్నామ్ అలాయ్ ఫ్యాక్టరీ యాజమాన్యంవారు విద్యా సామగ్రిని వితరణ చేశారు. శుక్రవారం ఎంఈఓ బాబ్జి ఆధ్వర్యంలో సుమారు 20 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యా సమాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిల్లలకు సూచించారు. విద్యా సామాగ్రిని వితరణ చేసినందుకు ఫ్యాక్టరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ప్రతినిధులు హరిగణేషన్, గణనాథన్, సాయికృష్ణ, రవూఫ్, హెచ్ఎం శేషాద్రి, ఉపాధ్యాయుడు కేశవరావు, సీఆర్‌పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు మహిళా వర్సిటీ విద్యార్థులు

**తిరుపతి సిటీ:** మహరాష్ట్ర జలగాంలోని కేబీసీ యూనివర్సిటీలో ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఎంపికయ్యారు. వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ప్రత్యూష, కావ్య పరేడ్‌కు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. వర్సిటీలో విద్యా బోధనతో పాటు స్పోర్ట్స్, సేవా దృక్పథం, ఎన్ఎస్ఎస్ వంటి వాటిలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, ఆఫీసర్లు వజీహా భాను, గాయత్రి అభినందించారు.

## 15 నుంచి నైపుణ్య గణన

**తిరుపతి రూరల్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణనను ఈ నెల 15 నుంచి తిరుపతి రూరల్ మండలంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర తెలిపారు. శుక్రవారం ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం శుక్రవారం తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మొత్తం 8 అంశాలపై సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే చేపడతారని తెలిపారు. 15 నుంచి 59 ఏళ్ల వయసు గల ప్రతి ఒక్కరి విద్యార్హత, సాంకేతిక నైపుణ్యాలు, ఎలాంటి ఉపాధి పట్ల ఆసక్తి ఉంది తదితర అంశాలను సేకరిస్తారన్నారు. అనంతరం సర్వేలో విషయ సేకరణ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రిసోర్స్ పర్సన్‌లు హిమబిందు, దేవేంద్ర, యశ్వంతి, హర్షిత్ వివరించారు.



శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మాట్లాడుతున్న ఎంపీడీఓ రామచంద్ర

## టీటీడీ ఉద్యోగుల బ్యాంకు డైరెక్టర్‌గా చీర్ల కిరణ్

**తిరుపతి(అలిపిరి):** టీటీడీ ఉద్యోగుల బ్యాంకు డైరెక్టర్‌గా శుక్రవారం చీర్ల కిరణ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.


చీర్ల కిరణ్‌ను సన్మానిస్తున్న టీటీడీ ఉద్యోగులు

## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి

**పాకాల :** పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. శుక్రవారం పాకాల పంచాయతీ కార్మికులతో ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ హౌసింగ్‌లో ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. పత్తిపాటివారిపల్లె వద్ద మహా ప్రస్థాన్ ట్రస్ట్ వారు నూతనంగా నిర్మించిన హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. సత్యమ్మ ఆలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, స్థానిక నేత నాగరాజనాయుడు, ఎంపీటీసీ సభ్యులు చాముండేశ్వరి, లింగయ్య నాయడు, సర్పంచ్ కస్తూరి, ఎంపీడీఓ శశిరేఖ పాల్గొన్నారు.

## కొత్తగా పర్యాటక ప్యాకేజీ కింద మూడు టూర్లు

**తిరుపతి(అలిపిరి):** కార్తీక మాసం సందర్భంగా తిరుపతి నుంచి కొత్తగా మూడు కొత్త ప్యాకేజీ టూర్లను ప్రవేశపెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్. శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16, 23 తేదీలలో ఒక్కరోజు మహానంది, శ్రీశైలం ప్యాకేజీ టూర్ ఉంటుందన్నారు. నాన్ ఏసీ బస్సులో 16, 23 తేదీలలో శనివారం రాత్రి 9 గంటలకు ప్రయాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బస్సు తిరిగి మూడో రోజు సోమవారం ఉదయం 6 గంటలకు వస్తుందన్నారు. పెద్దలకు ఒకరికి టిక్కెట్ ధర రూ.3,300, పిల్లలకు రూ.2,510 (రవాణ చార్జీ, నాన్ ఏసీ, ఫ్రెషప్, భోజనం, గైడ్ సౌకర్యంతో కలిపి..) ఉంటుందని తెలిపారు. అలాగే తలకోన, శ్రీనివాసమంగాపురం టూర్ ప్యాకేజీకి (ప్రతి ఆది, సోమవారాలు) ఒకరికి రూ.400 (రవాణ చార్జీలు, గైడ్ సౌకర్యంతో కలిపి)తో ఉంటుందన్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. గుడిమల్లం ప్యాకేజీ టూర్‌లో తిరుచానూరు - అప్పలాయగుంట, గుడిమల్లం ఆలయాలకు రోజూ ఒకరికి రూ.400 (రవాణా చార్జీ, గైడ్ సౌకర్యంతో కలిపి...) ఉంటుందన్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఈ కొత్త ప్యాకేజీ టూర్లను తిరుపతి, చిత్తూరు జిల్లా ప్రజలు, యాత్రికులు వినియోగించుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం .9848007033, 0877-2289123లలో సంప్రదించాలని కోరారు.

## 15 వరకు తపాలా శిబిరాలు

**తిరుపతి(అలిపిరి):** తపాలా శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఈనెల 15వ తేదీ వరకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)తో కొత్త ఖాతాలను తెరవడం, ఆధార్ లింకేజీని సులభతరం చేయడానికి ప్రత్యేక క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల కోసం నిర్వహించనున్నట్లు తిరుపతి పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ బీ.నరసప్ప తెలిపారు. జిల్లా యంత్రాంగం సహకారంతో గ్రామ, వార్డు సచివాలయ స్థా యిల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని.. కొత్త ఐపీపీబీ బ్యాంక్ ఖాతాల ను తెరవడం, ఇప్పటికే ఉన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేయడం, ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌ను సులభతరం చేయడం ప్రాథమిక లక్ష్యమని పేర్కొన్నారు.

## దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ అన్యాయం

**తిరుపతి అర్బన్ :** దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించడం అన్యాయమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి గొటుకుల జాఘువా మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మతం మార్చుకున్నవారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు మోమిడి లీలాకృష్ణ, పెనుబాల చంద్రశేఖర్, సూర్యకిరణ్, చినేపల్లి కిరణ్, సురేష్ నాయక్, కుమార్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై కొరడా

**చంద్రగిరి:** గత కొంత కాలంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుకాసురులపై ప్రభుత్వ అధికారులు కొరడా ఝుళిపించారు. స్వర్ణముఖినదిలో ఇసుకను తలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని నరసింగాపురం సమీపంలోని శుక్రవారం పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగుతున్నట్లు అధికారులకు సమాచారం అందింది. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా స్వర్ణముఖి వాగులో దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఏడు ఇసుక ట్రాక్టర్లు, రెండు జేసీబీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అయితే సీజ్ చేసిన వాహనాల్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది వాహనాలు ఉన్నట్లు సమాచారం.

## తిరుమలలో గోల్డ్ అప్రైజర్ తొలగింపు

**తిరుమల:** తిరుమలలోని తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంకులో నకిలీ బంగారంపై రుణం అందజేతలో కీలకభూమిక పోషించిన గోల్డ్ అప్రైజర్‌ను బ్యాంకు అధికారులు తొలగించారు. ఇటీవల తిరుమల శాఖలో నకిలీ నగలపై రుణం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై బ్యాంకు ఉన్నతాధికారులు పరిశీలన జరిపి మోసం జరిగినట్లు గుర్తించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ మోసానికి కారణమైన గోల్డ్ అప్రైజర్ తోపాటు మిగిలిన నిందితులపై తిరుమల టూటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు బ్యాంకు ఉన్నతాధికారులు ప్రయత్నించారు. అయితే మోసానికి సంబంధించిన పూర్తి వివరాలతోపాటు, ఆధారాలను తీసుకురావాలని పోలీసు అధికారులు సూచించడంతో శుక్రవారం అధికారులు వెనుతిరిగారు.

## తెలుగు సాహితీ సదస్సు ప్రారంభం

**తిరుపతి సిటీ:** జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా భావన సాహితీ వేదిక పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న తెలుగు భాషా జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భావన ప్రియ సాహితీ వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎస్‌సీహెచ్ చక్రవర్తి, డాక్టర్ అల్లాడి మోహన్, వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం భావన సాహితీ వేదిక ద్వారా తెలుగు భాషలో రచించినటువంటి 22 పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భావన ప్రియ సాహితీ వేదిక ప్రారంభించి ఏడేళ్లు కావస్తోందని, తెలుగు భాషా వైభవాన్ని, భాషను అందరూ సంరక్షించాలని కోరారు. డాక్టర్ సాంబశివమూర్తి, డాక్టర్ బి.నల్లన్న, వంద మందికిపైగా రచయితలు, కవులు పాల్గొన్నారు.


రచనలను ఆవిష్కరిస్తున్న అతిథులు, వర్సిటీ అధికారులు

## జీవవైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం

**తిరుపతి సిటీ:** ఆధునిక సమాజంలో జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవాల్సిన అవసరం ఉందని ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతను భట్టాచార్య, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీ, ఐఐటీ, ఐజర్, ద్రావిడ వర్సిటీల భాగస్వామ్యంతో వర్సిటీలో ఏపీ ఎస్‌సీహెచ్ఈ–ఐఐసీ తిరుపతి క్లస్టర్ ప్రోగ్రాంను ప్రారంభించారు. వర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని జీవవైవిధ్య పరిరక్షణపై ప్రసంగించారు. మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, డీన్ సుజాతమ్మ, ప్రొఫెసర్ మమత, డాక్టర్ ప్రసన్న ల్గొన్నారు

## మామిడి సేద్యం బలోపేతం


వేదికపై హరినాథ్‌రెడ్డితోపాటు నాబార్డ్ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు

**తిరుపతి అర్బన్:** మామిడి సేద్యం బలోపేతం చేద్దామని రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ సీబీ హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుచానూరులోని తాజ్ హోటల్‌లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(ఎఫ్ఏసీఈ)వారు ఇంటర్‌ఫేస్ ఇన్ మ్యాంగో వాల్యూచైన్‌ను బలోపేతం చేయడానికి స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మామిడి సాగులో ఏపీ అగ్రగామిగా ఉందని గుర్తుచేశారు. అయితే ఇటీవల మామిడి సాగుచేస్తున్న రైతులు 30 శాతానికి పైగా నష్టపోతున్నట్లు లెక్కలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో నాబార్డ్ ప్రతినిధులు పుష్పిత్ గార్గ్, లక్ష్మీప్రసాద్, విజయవిహారి, సునీల్, చిత్తూరు జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు మండల ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆదాయపు పన్నుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రవీంద్రరెడ్డి

**తిరుపతి కల్చరల్ :** చార్టర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆదాయపు పన్ను పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివాద్ సే విశ్వాస్–2024 పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌కమ్‌టాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బల్లా, జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్ హాజరయ్యారు. చార్టర్డ్ అకౌంట్స్ తిరుపతి శాఖ చైర్మన్ రవీంద్రరెడ్డి వివాద్ సే విశ్వాస్ పథకంపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదనబాబు, సభ్యులు జగదీష్ కృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

## టీడీపీ బూటకపు హామీలపై పోరాటం



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, ఇతర నేతలు

**నాయుడుపేట టౌన్:** కూటమి ప్రభుత్వ బూటకపు హామీలపై ప్రజలతో కలసి పోరాటం చేయడానికి వైఎస్సార్ సీపీ సిద్ధమైందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ చేపట్టే సంస్థాగత విషయాలపై చర్చించారు.

## పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నేత హరినాథరెడ్డి

**తిరుపతి కల్చరల్:** ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామాల్లో అయితే 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు, వాటి నిర్మాణానికి రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పీ.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల మంజూరు కోసం ఈనెల 18న అన్ని సచివాలయాల ఎదుట నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈనెల 26న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చిన్నరాజు, సుధాకర్‌రెడ్డి, గురవయ్య,బాలక్రిష్ణ, కత్తిరవి, ఉదయ్‌కుమార్, నిదియా పాల్గొన్నారు.

## మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు ప్రవేశ పెట్టాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

**తిరుపతి సిటీ :** ఎస్వీయూలో మూడేళ్ల వ్యవధిగల ఎల్ఎల్‌బీ కోర్సును ప్రవేశ పెట్టాలని జాతీయ న్యాయ విద్యార్థుల సంఘం (ఎన్ఎల్ఎస్‌పి) వ్యవస్థాపక అధ్యక్షుడు సుందరరాజు డిమాండు చేశారు. ఆయన శుక్రవారం ఎస్వీయూ యూత్ ఫెస్టివల్ ప్రారంభానికి హాజరైన రాష్ట్ర రవాణా శాఖా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లా కళాశాలలు ఉన్నాయని తెలిపారు. వాటిలో ప్రైవేటు కళాశాలల యజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన ట్యూషన్ ఫీజులకు రెండింతలు అధికంగా వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. వాటిపై చర్యలు తీసుకుని అనుమతులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి మోహన్, ఓబీసీ సంఘం అధ్యక్షుడు తిరుమలేష్, బీసీ జాక్ స్టూడెంట్ యూనియన్ రాయలసీమ ఇన్‌చార్జి విజయ్, యోగేష్, ముఖేష్ పాల్గొన్నారు.

## సర్వేతో తేలిన దౌర్జన్యం!


వివాదాస్పద భూమిని సర్వే చేసి హద్దులు చూపుతున్న సర్వేయర్లు, పక్కన సీఐ చిన్నగోవిందు

**తిరుపతి రూరల్:** తనది కాని భూమిని ఆక్రమించేందుకు చేసిన ప్రయత్నాలను సర్వే అనే ఆయుధంతో రైతులు తిప్పికొట్టిన ఘటన తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వ పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. కల్పన అనే మహిళ తిరుపతి రూరల్ మండలం, పేరూరు లెక్కదాఖల సర్వే నం.197/1లో 50 సెంట్ల భూమిని కొనుగోలు చేసింది. తను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి సరైన దారిలేదు. అందుకే పక్కనే ఉన్న సర్వే నం.197/2 లోని భూమికి సంబంధించిన హద్దులను రిజిస్ట్రేషన్ సమయంలో చూపించారు. హద్దులు చూపించారు కాబట్టి సర్వే నం .197/2లోని భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. దౌర్జన్యంగా భూమి చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించారు. అయితే 197/2కు సంబంధించిన రైతులు 15 ఏళ్ల క్రితమే లేఅవుట్ వేసి 14 మందికి ప్లాట్ల రూపంలో విక్రయించారు. తమ భూమిలో కల్పన దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తోందని, రక్షించాలని కొనుగోలు దారులు, రైతులు వేడుకున్నా పోలీసులు పట్టించుకోలేదు. అమరావతి స్థాయిలో ప్రభుత్వంలోని కొందరు పెద్దల ఒత్తిళ్లతో పోలీసులు కల్పనకు వత్తాసు పలుకుతున్నారని రైతులు ఆరోపించారు. దానికి తగ్గట్టుగానే కల్పన ఫిర్యాదు చేయడం, రైతులు, కొనుగోలుదారులపై తిరుపతి రూరల్ పోలీసులు కేసులు నమోదు చేయడం వెనువెంటనే జరిగిపోయాయి. సర్వేచేసి ఆమెకు సంబంధించిన భూమి అయితే తీసుకోవాలని బాధితులు చెప్పడంతో పోలీసులు సర్వేకు నిర్ణయించారు.

**సీఐ సాక్షిగా....**

సర్వే నం.197/1, 197/2 భూమికి సంబంధించిన హద్దులను నిర్ధారించాలని తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు రూరల్ తహసీల్దార్‌కు లేఖ రాశారు. దీంతో శుక్రవారం మండల సర్వేయర్ హేమ కుమార్, విలేజ్ సర్వేయర్లు, సీఐ చిన్నగోవిందు వివాదంలోని పట్టా భూమిని సర్వే చేశారు. కల్పన నిర్మిస్తున్న ప్రహరీ ఆమెకు సంబంధం లేని సర్వే నం.197/2 లో ఉందని, ఆమె భూమి పక్కన ఉందని సర్వేయర్లు నిర్ధారించారు. ఆ మేరకు హద్దులను సైతం చూపించారు. న్యాయం గెలిచిందని రైతులు, ప్లాట్ల యాజమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే 197/2లో తాను నిర్మించుకున్న ఇంటితో పాటు తనపేరుతో ఉన్న విద్యుత్ మీటర్‌ను సైతం దొడ్డిదారిలో కల్పన పేరుతో మార్చుకున్నారని పేరూరుకు చెందిన హేమంత్ ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. లంచాలకు అలవాటు పడి విద్యుత్ మీటర్‌ను కల్పన పేరుతో మార్చిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమపై కేసులు పెట్టి మానసికంగా వేధించిన కల్పనపై చర్యలు తీసుకోవాలని రైతులు యోగానందరెడ్డి, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

## పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న బీజేపీ నేతలు

**తిరుపతి కల్చరల్ :** మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ నేతలు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గంగమ్మ గుడి వద్ద పేదలకు అన్నదానం చేశారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుబ్రమణ్యం యాదవ్, రవిప్రసాద్, చంద్రబాబు యాదవ్, తేజ, సవిత, జనార్ధన్‌రెడ్డి, కృష్ణారావు, చంగల్రాయులు, వెంకటరత్నం పాల్గొన్నారు.

## 'ఎస్‌డీహెచ్ఆర్'లో రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న చక్రవర్తి రెడ్డి

**తిరుపతి సిటీ :** న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో చైర్మన్ డీవీఎస్ చక్రవర్తి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది రక్తదానం చేశారు. అనంతరం కళాశాల చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి, అన్నదానం చేపట్టారు.

## ప్రభుత్వ విధానాలపై నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

**పాకాల :** రైతులు, రైతు కూలీలపై అధిక భారం మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజాపోరు కార్యక్రమం కింద సీపీఎం నేతలు శుక్రవారం ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగంగా పోస్టర్లు ఆవిష్కరించి, కరపత్రాలు పంచిపెట్టినట్లు వెల్లడించారు. దళితులు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలను అరికట్టాలని కోరారు. జిల్లాలో మిగులు భూములను దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేతలు ప్రసాద్, నరేంద్ర, హరిప్రకాష్, రాజు పాల్గొన్నారు.

## శిల్పారామం ఘటనలో గాయపడిన యువతి మృతి

**చంద్రగిరి(తిరుచానూరు):** శిల్పారామంలో క్రాస్ వీల్ ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన యువతి శుక్రవారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 3వ తేదీన సాయంత్రం ఆటవిడుపు కోసం తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన లోకేశ్వరి(22), గౌతమి శిల్పారామంకు వెళ్లారు. అక్కడ నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రాస్‌వీల్ ఎక్కారు. ప్రమాదశాత్తు క్రాస్ వీల్ విరిగి పడడంతో 20 అడుగుల ఎత్తు నుంచి ఇద్దరూ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో లోకేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువతి గౌతమి(18) తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గురువారం మెరుగైన చికిత్స కోసం ఆమెను ప్రైవేటు ఆసుపత్రి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. సుమారు 5 రోజుల పాటు మృత్యువుతో పోరాడిన గౌతమి శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### అభాగ్యులకు ఆపన్నహస్తం



యాచకులకు భోజనం, దుస్తులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి : ఆలయాల వద్ద భిక్షాటన చేసుకునే అభాగ్యులకు వైఎస్సార్‌సీపీ నేతలు ఆపన్న హస్తం అందించారు. శనివారం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం సుమారు 100 మంది యాచకులకు దుస్తులు, భోజనం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచిన చెవిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గత పదేళ్లుగా చెవిరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నేతలు మట్టిరెడ్డి బాలాజీ, నవీన్, శివ, రాజేష్, శ్రీకృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

### బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం



రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు

తిరుపతి రూరల్ : మద్యం పాలసీకి వ్యతిరేకంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు హెచ్చరించారు. శుక్రవారం రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇప్పటి వరకు రేణిగుంటలో ఒకటి, రూరల్ మండలంలో మూడు, మొత్తం నాలుగు కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. వైన్‌షాపుల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయించాలని స్పష్టం చేశారు. బార్లలో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయించవచ్చని తెలిపారు.



## హామీల అమలులో నిర్లక్ష్యం

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు కార్యక్రమం శుక్రవారం సుందరయ్యనగర్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలపై కరెంట్ చార్జీల భారాలు మోపడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14వ తేదీన కలెక్టరేట్ చేపట్టే ధర్నాకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, జి.బాలసుబ్రమణ్యం, పి.సాయిలక్ష్మి, కె.వేణుగోపాల్, చిన్న, బుజ్జి, ఆర్.లక్ష్మి, పి.హేమలత, నరేంద్ర, మల్లికార్జునరావు, మునిరాజు, లోకేష్, డీవైఎఫ్ఐ నేతలు సోము, సురేష్, మహ్మద్, కార్తీక్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చంద్రగిరి : సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ కోసం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ వాసు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నాణ్యమైన విద్య అవసరం

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 43 విద్యాసంస్థలను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించడం అవసరమని, ఈ మేరకు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీకి అనుగుణంగా కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. కళాశాలలు, హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాలని చెప్పారు. ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, మేధావులతో చర్చించాలని సూచించారు.

## సిద్ధేశ్వరునికి ప్రత్యేక పూజలు

భాకరాపేట : తలకోన సిద్ధేశ్వర స్వామి ఆల యంలో కార్తీక శుక్రవారం సందర్భంగా ప్ర త్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఉసిరి చెట్టు కింద కార్తీక దీపా లు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

## మీడియాను అడ్డుకోవడం హేయం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో యూత్ ఫెస్టివల్ కవరేజ్ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులను అడ్డుకోవడం హేయమని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి మండిపడ్డారు. శుక్రవారం ఎస్వీయూ వేదికగా రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించిన యూత్ ఫెస్టివల్‌కు హాజరైన మీడియా ప్రతినిధులపై కో–ఆర్డినేటర్ పేరుతో ఓ డ్యాన్స్ మాస్టర్ వీరంగం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. వర్సిటీ అధికారులు దీనిపై విచారణ చేపట్టి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శాస్త్రోక్తంగా దక్షిణామూర్తి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం దక్షిణామూర్తిస్వామి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు దక్షిణామూర్తి హోమం, కలశాభిషేకం జరిపించారు. సాయంత్రం కలశస్థాపన,విశేష దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం భాకరాపేట పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ నాగరాణి తెలిపారు. బ్లడ్ గ్రూప్, హెమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రవీంద్ర పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది